సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 25 । జూన్‌ । 2024





## సోమశిలలో 10.070 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 10.070 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు నుంచి 397 క్యూసెక్కుల వరద వస్తుండగా దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



## బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు) | రూ.73,880 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్‌ (1 గ్రా) | రూ.6,617 |
| 3శాతం జీఎస్టీతో | రూ.6,816 |
| సవర (8గ్రా) | రూ.54,528 |

## వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.2 /27.6

జిల్లాలో మంగళవారం అక్కడక్కడ ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. చిరుజల్లులు పడే అవకాశం ఉంది. వాతావరణంలో తేమ 70 శాతం ఉంది.

## న్యూస్‌రీల్‌

### 518 పొగాకు సూర బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 518 పొగాకు సూర బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్‌ తెలిపారు. వేలానికి 562 బేళ్లు రాగా వాటిలో 518 పొగాకు బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 62,594 కిలోల పొగాకును విక్రయించగా రూ. 54,52,297 వ్యాపారం జరిగింది. వేలంలో 6 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

### డీకేడబ్ల్యూలో జాబ్‌డ్రైవ్‌



మాట్లాడుతున్న ప్రిన్సిపల్‌ గిరి

నెల్లూరు (టౌన్‌): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జేకేసీ, ప్లేస్‌మెంట్‌ సెల్‌ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌డ్రైవ్‌ నిర్వహించారు. ఈ జాబ్‌డ్రైవ్‌లో వివిధ కళాశాలలకు చెందిన 52 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్‌ గిరి మాట్లాడుతూ చెన్నై, శ్రీసిటీ, నెల్లూరుకు చెందిన పలు కంపెనీలు జాబ్‌డ్రైవ్‌లో పాల్గొన్నాయని చెప్పారు. వివిధ కళాశాలలకు చెందిన 213 మంది విద్యార్థులు హాజరవగా, 118 మంది అర్హత సాధించారని చెప్పారు. వీరిలో 52మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్‌ వెంకటేశ్వర్లు, ఏడుకొండలు పాల్గొన్నారు.

### వీఆర్‌ కళాశాలను పరిశీలించిన ఎన్‌సీఈఆర్టీ బృందం

నెల్లూరు (టౌన్‌): జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్టీ) బృందం సోమవారం వీఆర్‌ కళాశాలలో జరుగుతున్న ఆ సంస్థ ప్రాంతీయ కేంద్ర కార్యకలాపాలను పరిశీలించారు. జిల్లాలోని వెంకటాచలం మండలం చవటపాళెంలో జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న పలు కార్యక్రమాలను తాత్కాలికంగా వీఆర్‌ కళాశాల భవనాల్లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు కేంద్రం ఓఎస్డీ ప్రొఫెసర్‌ రమేష్‌బాబు మాట్లాడుతూ తాత్కాలికంగా వీఆర్‌ కళాశాలలోని 25 తరగతి గదులను తీసుకున్నామని, విద్యార్థుల కోసం మరో రెండు వెయిటింగ్‌ హాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇక్కడి తరగతి గదులను బోధనకు అనుకూలంగా చేసిన తర్వాత ఎన్‌సీఈఆర్టీ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు.

### గ్యాస్‌ కనెక్షన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

వింజమూరు(ఉదయగిరి): జిల్లాలో గ్యాస్‌ కనెక్షన్‌ ఉన్న ప్రతి వినియోగదారుడు ఈ నెలాఖరులోపు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ సకాలంలో బ్యాంకు ఖాతాల్లో జమ కావాలంటే ఈకేవైసీ తప్పని సరని అధికారులు తెలిపారు. కనెక్షన్‌ కుటుంబంలో మగ, ఆడ ఎవరి పేరు మీద ఉన్నా సబ్సిడీ వర్తిస్తుంది.

# ఆధిపత్యం.. అంతర్యుద్ధం

కావలి టీడీపీలో ఆధిపత్యం.. అంతర్యుద్ధం పతాక స్థాయికి చేరింది. 'ఏరు దాటే వరకు మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న' చందానా సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు సాగిన ఐక్యతారాగం.. ఇప్పుడు శృతి తప్పింది. ఆది నుంచి పార్టీకి వెన్నుదన్నుగా, సార్వత్రిక ఎన్నికల్లో విజయానికి ఎదురొడ్డి నిలిచిన నేతలనే టార్గెట్‌ చేయడం ఇప్పుడు ఆ పార్టీలో అగ్గి రాజుకుంది. అధికారంలోకి వచ్చామనే అహంకారంతో చెలరేగిపోయిన మాలేపాటి కుటుంబంపైనే కేసులు నమోదు చేయించడంతో జీర్ణించుకోక మానసిక క్షోభతో తీవ్ర అస్వస్థతకు గురై ఐసీయూలో చికిత్స పొందుతున్న పరిస్థితి చూస్తే టీడీపీలో అంతర్యుద్ధానికి అద్దం పడుతోంది.

**కావ్య వర్సెస్‌ మాలేపాటి, బీద!**

- కావ్య కనుసైగలతో మాలేపాటిపై కేసుల నమోదు?
- ఆగ్రహంతో రగిలిపోయి.. మానసిక క్షోభతో తీవ్ర అస్వస్థత
- ఐసీయూలో చికిత్స పొందుతున్న మాలేపాటి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి టీడీపీ అంటే బీద రవిచంద్ర.. మాలేపాటి సుబ్బానాయుడు. ఇది మొన్నటి వరకు ఉన్న పరిస్థితి. ఎన్నికలు ముగిశాయి.. ఫలితాలు వెలువడ్డాయి. ఇంకా పరిపాలన గాడిలో పడలేదు. కానీ అప్పుడే టీడీపీలో రాజకీయ ముసలం మొదలైంది. ఆ పార్టీ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత నుంచి పార్టీ కాడి మోసే నేత లేని పరిస్థితుల్లో దగదర్తికి చెందిన మాలేపాటి సుబ్బానాయుడు రూ.కోట్లు ఖర్చు పెట్టుకుని ఉనికిని కాపాడుకుంటూ వచ్చాడు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అండతో అధిష్టానం ఆశీస్సులతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగారు. తానే కాబోయే ఎమ్మెల్యే అభ్యర్థినంటూ విస్తృత ప్రచారం చేసుకున్నాడు. అయితే రాజకీయ సమీకరణాలు మారిపోవడంతో కావ్య కృష్ణారెడ్డి తెరపైకి రావడం, సార్వత్రిక ఎన్నికల్లో అధికారం మార్పు జరగడం చకాచకా జరిగిపోయాయి. ఈ క్రమం పార్టీకి విధేయుడిగా పని చేసిన సుబ్బానాయుడు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కావ్య కృష్ణారెడ్డి విజయంలో తనదైన పాత్ర పోషించారు.

**అయితే ఇప్పుడేం జరిగిందంటే..**

ఎన్నికల కౌంటింగ్‌ పూర్తయ్యాక కావ్య కృష్ణారెడ్డి విజయం సాధించిన తర్వాత టీడీపీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో విజయోత్సవాలు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పలుచోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని టీడీపీ శ్రేణులు అనేక చోట్ల భౌతిక దాడులు, ఆస్తుల ధ్వంసం చేస్తున్నారు. ఈ క్రమంలో మాలేపాటి సుబ్బానాయుడు తన స్వగ్రామమైన దగదర్తిలో ఈ నెల 9న టీడీపీకి చెందిన మాలేపాటి రవీంద్రనాయుడు, మాలేపాటి భాను, వడ్డే వినయ్, తాండ్రా కార్తీక్, తాండ్రా వెంకటేశ్వర్లు తదితరులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు మార్లెళ్ల వెంకటేశ్వర్లు ఇంటి ప్రహరీని జేసీబీతో ధ్వంసం చేశారు. దీంతో వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు దగదర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిపై పోలీసులు ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేశారు. మాలేపాటి సుబ్బానాయుడు, భాను, గోపాల్, సూరయ్య, వినయ్ తదితరులు జేసీబీతో తమ ఇంటి ప్రహరీని కూల్చి వేశారని, అడ్డుకోబోయిన తన కోడలు, తనను దుర్భాషలాడుతూ దాడి చేయబోయారని దగదర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారు అయిన కాండ్రా కామేశ్వరమ్మ టీడీపీ నేతలపై మరో ఫిర్యాదు చేశారు. 'నీ కొడుకు శ్రీనివాసులు ఎక్కడున్నా వెతికి చంపేస్తామంటూ' తమపై దాడి చేయబోగా వారి నుంచి తప్పించుకొని పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదుపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

**మాలేపాటికి షాక్‌ ఇచ్చిన కావ్య**

మాలేపాటి అండ్‌ గ్యాంగ్‌ సాగించిన అరాచకంపై తన మండలంలోనే తమపై కేసులు నమోదు కావడాన్ని జీర్ణించుకోలేకపోయిన మాలేపాటి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. మాపై కేసులు పెడుతుంటే.. చూస్తూ ఊరుకుంటావా? అంటూ ఆధిపత్యం ప్రదర్శించే ప్రయత్నం చేశాడు. ఇదే సమయంలో కావ్య కూడా గట్టిగానే తిరిగి ప్రశ్నలు సంధించడంతో ఇద్దరి మధ్య వాగ్యువాదం తారస్థాయికి చేరింది. 'ఎవర్ని అడిగి గోడలు కూల్చారు.. ఎవరిని అడిగి విచ్చలవిడిగా దౌర్జన్యాలు చేశారంటూ' కావ్య నిలదీశారంట. ఎన్నికల ముందు నుంచి మాలేపాటి ఆర్థికంగా తనను వేధించిన విషయాలను మనస్సులో పెట్టుకున్న కావ్య ఒక్కొక్కటిగా కడిగిపారేయడంతో సుబ్బానాయుడు తీవ్ర ఫ్రస్ట్రేషన్‌ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతడిని కుటుంబ సభ్యులు చెన్నైలోని ఆస్పత్రికి తరలించి వెంటిలేటర్‌పై పెట్టి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పిందని తెలుస్తోంది. ప్రస్తుతంలో ఐసీయూలో కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది.

**కావ్య వైఖరితోనే ఈ పరిస్థితి..**

కావ్య కృష్ణారెడ్డి ఉద్దేశ పూర్వకంగానే మాలేపాటిపై కేసులు పెట్టించి.. ఆయన్ను తీవ్రంగా అవమానించడంతో పాటు వేధింపులకు గురిచేయడం కారణంగానే మాలేపాటి చావుబతుకుల్లో ఉన్నాడని ఆయన బంధువులు, అభిమానులు తీవ్ర ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. టీడీపీ ప్రారంభం నుంచి వీరవిధేయులుగా ఉన్న తమను కాదని, ధన బలంతో పార్టీ టికెట్‌ చేజిక్కించుకొని ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి తమను ఇంతగా కించపరచడాన్ని మాలేపాటి వర్గీయులు ఏ మాత్రం సహించబోమని చెబుతున్నట్లుగా తెలుస్తోంది. రానున్న రోజుల్లో అసలైన తెలుగుదేశం పార్టీ శ్రేణులు మాలేపాటికి అండగా నిలవాలని అంతర్గతంగా జోరుగా చర్చ జరుగుతున్నట్టు కూడా ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే కావలి టీడీపీలో రెండు రాజకీయ కుంపట్లు ఏర్పడి మరింత సంక్షోభానికి దారి తీయవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే కావ్య కృష్ణారెడ్డి వైఖరిపై బీద రవిచంద్ర కూడా కక్కలేక.. మింగలేక రగిలిపోతున్నట్లు సమాచారం. మాలేపాటి విషయంలో కావ్య వ్యవహరిస్తున్నట్లు తీరు, పార్టీ పరిస్థితిపై లోకేశ్‌ వద్ద పంచాయితీ పెట్టనున్నట్లు తెలుస్తోంది.

# ప్రజా పరిష్కార వేదికకు సమస్యల వెల్లువ



దివ్యాంగురాలి వద్ద అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్‌ హరినారాయణన్‌



దివ్యాంగుడి వద్ద అర్జీ స్వీకరిస్తున్న జేసీ సేతు మాధవన్‌

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలుగా నిలిచిపోయిన స్పందన కార్యక్రమం.. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మొదటిసారిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ప్రారంభమైంది. కలెక్టర్‌ ఎం.హరినారాయణన్‌ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు వెల్లువలా వచ్చాయి. కలెక్టర్‌తో పాటు జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ లవన్న, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ కేవీ సాంబశివారెడ్డి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

➡ 1998లో మూతపడిన సర్కార్‌ పేపర్‌ మిల్లు కార్మికులు తమను ఆదుకోవాలంటూ వినతిపత్రం అందజేశారు. 1983లో మొదలైన ఈ మిల్లును 1998లో మూసేశారని, దీని వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా 800 మంది రోడ్డున పడ్డారన్నారు. తమకు ఎటువంటి బెనిఫిట్స్‌ రాలేదని, బెనిఫిట్స్‌తో పాటు ప్రతి కార్మికుడికి 20 అంకణాల నివాస స్థలం ఇప్పించాలన్నారు.

➡ రాజకీయ కక్షలతో తొలగించిన మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తిరిగి కొనసాగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్‌ మధ్యాహ్న భోజన పథకం సంఘం ప్రతినిధులు రెహనాబేగం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంకటాచలం మండలం కనుపూరులో 20 ఏళ్లగా మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న జ్యోతమ్మను అకారణంగా తొలగించారన్నారు.

➡ ప్రభుత్వ భవనాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కొడవలూరు మండలం పెమ్మారెడ్డిపాళెం గ్రామ సర్పంచ్‌ నవీన్‌ వినతిపత్రం అందచేశారు. గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారు పంచాయతీ భవనం, సొసైటీ భవనాలకు చెందిన కలపను అక్రమంగా తరలించారని, ఆయా భవనాలను కూడా ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

ఈ విధంగా అనేక మంది వివిధ సమస్యలపై అధికారులకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీపీఓ సుస్మిత, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఇరిగేషన్, విద్యుత్‌ శాఖల ఎస్‌ఈలు కృష్ణమోహన్‌ విజయన్, సమగ్ర శిక్ష పీఓ ఉషారాణి, డీటీసీ చందర్, మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ జేడీలు నాగేశ్వరరావు, మహేశ్వరుడు, డీసీహెచ్‌ఎస్‌ రమేష్‌నాథ్, హౌసింగ్, మెప్మా, డ్వామా, ఐసీడీఎస్‌ పీడీలు నాగరాజు, రవీంద్ర, వెంకట్రావు, హేనాసుజన్, బీసీ, ఎస్సీ వెల్ఫేర్‌ అధికారి వెంకటయ్య తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ దాష్టీకాలపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న కాకాణి, ఆదాల చిత్రంలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి, మురళీధర్‌ తదితరులు

- అక్రమ కేసులను పునః పరిశీలించి న్యాయం చేయండి
- ఎస్పీకి వైఎస్సార్‌సీపీ నేతల వినతి

నెల్లూరు (క్రైమ్‌): వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులపై దాడులకు పాల్పడుతోన్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ తదితరులు ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్‌ను కోరారు. జిల్లాలో అధికార పార్టీ కక్ష పూరిత రాజకీయాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై హింసాత్మక దాడులు, పోలీసుల అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ నేతలు నెల్లూరులోని ఎస్పీని పోలీసు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. టీడీపీ నేతల దాష్టీకాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను ఎస్పీకి అందజేశారు. స్పందించిన ఎస్పీ తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఓ పథకం ప్రకారం జిల్లాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు, ఆస్తుల ధ్వంసం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. మరో వైపు పోలీసులతో అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నామని, ఇలాంటి దుర్మార్గమైన ఘటనలు మునుపెన్నడూ చూడలేదన్నారు. ప్రశాంతమైన జిల్లాలో టీడీపీ నేతలు అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు తమ తీరు మార్చుకోవాలని, లేని పక్షంలో తాము ధీటుగా సమాధానమిస్తామన్నారు. మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, ఇలాంటి నీచ సంస్కృతి, సంప్రదాయాలను ఏ నాడు చూడలేదన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రత్యర్థులుగా ఉండి ఎన్నికల అనంతరం అందరూ కలిసి మెలిసి పోయేవారమన్నారు. అయితే నేడు అందుకు భిన్నంగా అధికార టీడీపీ నేతలు ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలు, బెదిరింపులు, దౌర్జన్యాలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. అన్నీ విషయాలను ఎస్పీ దృష్టికి ఆధారాలతో సహా తీసుకెళ్లామని, ఎస్పీ ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. సానుకూలంగా స్పందించిన ఎస్పీకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట విజయ డెయిరీ చైర్మన్‌ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి, మల్లు సుధాకర్‌ రెడ్డి, బొబ్బల శ్రీనివాస యాదవ్, వెంకట శేషయ్య, భాస్కర్‌ గౌడ్, వైవీరెడ్డి, శ్రీధర్‌ బాబు తదితరులు ఉన్నారు.

# మా కష్టాలు మీరే తీర్చాలి

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి బాధితుల వేడుకోలు



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్‌

నెల్లూరు (క్రైమ్‌): పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నాం. సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మీరైనా సమస్యను పరిష్కరించండి అంటూ పలువురు ఎస్పీ కె. ఆరిఫ్‌హఫీజ్‌ను కోరారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 102 మంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ప్రసాద్, సీసీఎస్, మహిళా పోలీసుస్టేషన్‌ డీఎస్పీలు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్, ఆర్‌ఐ తదితరులు పాల్గొన్నారు.

**సంతపేట పోలీసులు పట్టించుకోలేదు**

మేము నగరంలోని రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్నాం. అదే ప్రాంతానికి చెందిన లీలామోహన్, వాసంతి దంపతులు ఎన్నో ఏళ్లగా కూల్‌డ్రింక్, ప్రొవిజన్‌ షాప్, బియ్యం వ్యాపారం చేస్తూ అందరితో నమ్మకంగా ఉండేవారు. దీంతో వారి వద్ద సుమారు 50 మంది నెలవారీ చీటీలు వేశాం. వాటి కాలపరిమితి దాటినా నగదు చెల్లించకుండా రేపు, మాపు అంటూ కాలాయపన చేస్తూ వచ్చారు. పొదుపులో సభ్యులుగా ఉండి నగదు తీసుకున్నారు. ఇటీవల రాత్రికి రాత్రే ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. రూ.కోటి వరకు అందరికి ఇవ్వాల్సి ఉంది. వారి మోసంపై సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదు. విచారించి తగిన చర్యలు తీసుకోండి.

– అనిత, గీతాలక్ష్మి, భవాని, చిట్టీల బాధితులు

**రైస్‌మిల్లు యజమానిపై చర్యలు తీసుకోండి**

తామంతా కష్టపడి పండించిన పంటను దళారుల ద్వారా నవాబుపేటలోని ఓ రైస్‌ మిల్లు యజమానికి పంపించాము. మిల్లు యజమాని రూ.5,66,70,000 ధాన్యం తాలూకా నగదు ఇవ్వాల్సి ఉంది. కొంతకాలంగా నగదు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుండడంతో అప్పులు తీర్చలేక కష్టాలు ఎదుర్కొంటున్నాము. రైస్‌మిల్లు యజమానిపై చర్యలు తీసుకుని న్యాయం చేయండి.

– ఓజిలి, అనంతసాగరం, ఆత్మకూరు రైతులు

# వీఎస్‌యూలో పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు

వెంకటాచలం: ఏపీఆర్‌సెట్‌ 2023–24 పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జూన్‌ 25 నుంచి 27వ తేదీ వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఏపీఆర్‌సెట్‌ ఇంటర్వ్యూ కో–ఆర్డినేటర్‌ డాక్టర్‌ హనుమారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్‌ 25న సోషల్‌ వర్క్, 26న టూరిజం మేనేజ్‌మెంట్, 26, 27వ తేదీల్లో బయోటెక్నాలజీ, అప్లైడ్‌ సైన్స్‌ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఆయా సబ్జెక్ట్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులు నిర్దేశిత తేదీల్లో విద్యార్హతలు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలియజేశారు.

# ఫోర్జరీ అసలు దోషి ఎవరు?

- నలుగురిపై వేటు.. మరొక ఉద్యోగికి షోకాజ్‌ నోటీసు
- ఈ వ్యవహారంపై విజిలెన్స్‌ విచారణకు ఆదేశాలు
- ఉద్యోగుల వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఎవరు?
- విచారణతో సరిపెడతారా?.. దోషులపై క్రిమినల్‌ చర్యలు తీసుకుంటారా??
- ప్రాథమిక విచారణలో గత కమిషనర్‌ సంతకం కూడా ఫోర్జరీ చేసినట్లు వెలుగు చూసిన వైనం

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఇందుకు బాధ్యులైన నలుగురు ఉద్యోగులపై వేటు పడింది. మరొకరికి షోకాజ్‌ నోటీసు జారీ చేశారు. ఈ చర్యలతో కమిషనర్‌ సంతకం ఫోర్జరీ చేయడం నిజమేనని స్పష్టమవుతోంది. ప్రస్తుత కమిషనర్‌ వికాస్‌మర్మత్‌ చేపట్టిన ముందస్తు విచారణలో నగర పాలక సంస్థ గత కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన హరిత సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసినట్లు బహిర్గతమైంది. దీంతో గతంలో, ప్రస్తుతం జరిగిన ఫోర్జరీ విషయాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని విజిలెన్స్‌ విభాగాన్ని కమిషనర్‌ వికాస్‌మర్మత్‌ ఆదేశించారు.

**ఫోర్జరీ వ్యవహారంలో రాజకీయ శక్తులు సేఫా!**

కమిషనర్‌ సంతకాన్ని వేర్వేరు వ్యక్తులు ఫోర్జరీ చేయలేరు. వీరి వెనుక అసలు పాత్రధారులు, సూత్రధారులు ఉన్నారనేది స్పష్టమవుతోంది. రాజకీయ నాయకుల ఒత్తిడితోనే ఉద్యోగులు ఈ వ్యవహారంలో భాగస్వామ్యులయ్యారు. ప్రస్తుతం నెల్లూరు నగర పాలక సంస్థలో సంచలనం కలిగించిన ఫోర్జరీ ఉదంతంపై ఉద్యోగులపై సస్పెన్షన్‌ చర్యలతో సరి పెడతారా? లేక క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తారా? అనేదానిపై సందిగ్ధత నెలకొంది. ఇందుకు బాధ్యులైన ఉద్యోగుల వెనుక రాజకీయ నాయకులు ఉన్నారనేది నిజం. ఫోర్జరీ వ్యవహారంలో మేయర్‌ స్రవంతి భర్త జయవర్ధన్‌ పాత్ర ఉందని స్పష్టమైన నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీలో ఉన్న వీరిపై అధికార పార్టీ వెనుక నుంచి ఫిర్యాదు చేయించింది. ఈ విషయం తెలిసిన తర్వాత నాలుగైదు రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన జయవర్ధన్‌ హడావుడిగా మీడియా ముందుకు వచ్చి నెల్లూరు రూరల్‌ ఎమ్మెల్యే కోటంరెడ్డి శరణు కోరుతూ.. క్షమాపణ అడుగుతూ వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. దీన్ని బట్టి జయవర్ధన్‌ పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. విజిలెన్స్‌ విచారణలో వీరిని తప్పించి, ఉద్యోగులనే బలి చేస్తారనే ప్రచారం జరుగుతోంది.



నగర పాలక సంస్థ కార్యాలయ భవనం

**ఫోర్జరీ చేయడం నిజమైతే.. క్రిమినల్‌ కేసులేవి?**

ఉద్యోగులు అయినా.. రాజకీయ నాయకులైనా ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు నిర్ధారణ అయితే అందులో భాగస్వామ్యులపై ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ కేసులో నేరాపణలు రుజువైతే ఏడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌ అయిన ఐఏఎస్‌ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేయడం తీవ్ర నేరంగా పరిగణించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చి ఇప్పటికే దాదాపు మూడు వారాలకు పైగా గడిచిపోయింది. అయినా ఇంత వరకు అసలు దోషులు ఎవరనేది తేల్చడకుండా షోకాజ్‌ నోటీసుల పేరుతో కాలయాపన జరుగుతోంది. కేవలం పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించిన ఉద్యోగులపైన మాత్రమే చర్యలు తీసుకున్నారే గానీ ఫోర్జరీ ఎవరు చేశారనే విషయాన్ని ఇప్పటి వరకు కనిపెట్టలేకపోవడంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదు. నలుగురు ఉద్యోగులపైన కేవలం శాఖపరమైన చర్యలు తీసుకున్నారే తప్ప వారిపై ఎలాంటి క్రిమినల్‌ కేసు ఎందుకు నమోదు చేయలేదని కార్యాలయంలోని పలువురు ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. ఈ వ్యవహారంలో ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయిన ఉద్యోగులపై కేసులు నమోదు చేస్తారా? లేదా? అనేది వేచి చూడాల్సి ఉంది.

# డయేరియా విజృంభణ

- జిల్లాలో వెలుగు చూస్తున్న కేసులు
- అవగాహనతోనే చెక్
- రక్షిత తాగునీరే అసలైన మందు





అనంతసాగరం మండలంలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు (ఫైల్)

**నెల్లూరు(అర్బన్):** జిల్లాలో డయేరియా కేసులు వెలుగు చూస్తున్నాయి. తొలకరి నేపథ్యంలో నదులు, చెరువుల్లోని నీరు కలుషితమవుతోంది. దీంతో అతిసారా వ్యాప్తి చెందుతోంది. అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీనిని అరికట్టవచ్చని డాక్టర్లు పేర్కొంటున్నారు. నిర్లక్ష్యం వహిస్తే మాత్రం ప్రాణాలు పోయే ప్రమాదముంది. ప్రస్తుతం తొలకరి వర్షాల ప్రారంభ సీజన్‌లో ఎక్కువగా కలుషిత నీటి వల్లనే డయేరియా కేసులు వెలుగు చూస్తున్నాయి. అయితే జీరో కేసులున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

### ముందస్తు చర్యలు చేపట్టాం



జిల్లాలో డయేరియా కేసులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. అందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేశాం. ఆశా, ఏఎన్‌ఎంలు సైతం క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. డయేరియా కేసులు నమోదు కాకుండా కలెక్టర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా పని చేస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సెలైన్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తగిన మందులు అందుబాటులో ఉంచాం. ఇప్పటి వరకు జిల్లాలో డయేరియా కేసులు నమోదు కాలేదు.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

### కొన్ని కేసులు

- నెల్లూరులోని 25వ డివిజన్ బుజబుజనెల్లూరు మిట్టమీద మూతపడిన మున్సిపల్ మినరల్ వాటర్ ప్లాంట్ దగ్గర సుమారు 60 ఏళ్ల వ్యక్తి శనివారం వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి గురయ్యాడు. స్థానిక మెడికల్ షాపులో మాత్రలు తెచ్చుకుని మింగాడు. అయినా తగ్గలేదు. నీరసించిపోగా ఆయన్ను కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ పెద్దాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు శరీరం నుంచి నీరు ఎక్కువగా బయటకు వెళ్లడం వల్ల కిడ్నీలు దెబ్బతిన్నాయని డాక్టర్లు చెప్పారు. దీంతో అక్కడి నుంచి డాక్టర్ రామచంద్రారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లారు. సీరియస్‌గా ఉందని పేషెంట్‌ను చేర్చుకోలేదు. ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడి డాక్టర్లు సలహా ఇచ్చారు. దీంతో తాము ఖర్చును భరించలేమని సంతపేటలోని సెయింట్ జోసెఫ్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ వైద్యం జరుగుతుండగానే రోగి ప్రాణాలు కోల్పోయాడు.
- ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు రూరల్ చెన్నూరు గ్రామంలోని ట్రైబల్ హాస్టల్ విద్యార్థులు 20 మంది డయేరియాకు గురయ్యారు. వారిలో ఆరుగురు నెల్లూరు జయభారత్ ఆస్పత్రిలో, పదిమంది జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు.
- అనంతసాగరంలోని గుంతబజార్‌వీధి సమీపంలో ఉన్న బావిలో నీరు కలుషితమైందని వార్తలొచ్చాయి. కొంతమంది వాంతులు, విరేచనాలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు వెళ్లి బావిని పరిశీలించారు. నీరు కలుషితం కాలేదని తెలిపి నీటిని పరీక్షించేందుకు నెల్లూరులోని ల్యాబ్‌కు పంపారు.
- ఇటీవల ముత్తుకూరు మండలంలోని ఓ గ్రామంలో డయేరియా కేసులు వెలుగు చూశాయి.

### అవగాహన కల్పించాలి



కలుషిత నీటి వల్లే డయేరియా వస్తుంది. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి వనరులు కలుషితం కాకుండా చూడాలి. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని వాడితే చాలా వరకు కేసులు ఆగిపోతాయి. అలాగే ఆహార పదార్థాలు కలుషితం కాకుండా చూసుకోవాలి. ఆహారం కలుషితమైతే డయేరియా వచ్చే అవకాశం ఉంది. అతిసారాకు గురైతే కొబ్బరి నీళ్లు, మజ్జిగ తాగాలి. ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీరు తాగొచ్చు. పండ్ల రసాలు తీసుకోవాలి. డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– డాక్టర్ రఫీ, డా.జీవీకే మెమోరియల్ ట్రస్ట్ నెల్లూరు హాస్పిటల్

# సమగ్ర విచారణకు వైఎస్సార్‌సీపీ డిమాండ్



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న బుర్రా, వైఎస్సార్‌సీపీ నాయకులు

**కందుకూరు:** పట్టణంలోని మూడో వార్డు ఉప్పు చెరువు కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎనుబోరు కిశోర్ మృతిపై సమగ్ర విచారణ చేయించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబసభ్యులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కోరారు. స్థానిక పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన డీఎస్పీ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కిశోర్ వైఎస్సార్‌సీపీ క్రియాశీల కార్యకర్త అని, గత అసెంబ్లీ ఎన్నికల్లో చుట్టుగుంటలోని 156వ బూత్ ఏజెంట్‌గా పనిచేశారని వివరించారు. వ్యక్తిగత కారణాలు లేదా రాజకీయ కారణాలు ఏమున్నా అవకతవకలకు తావు లేకుండా సమగ్ర విచారణ చేసి నిగ్గు తేల్చాలని కోరారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దళిత యువకుడు మృతిచెందాడని తెలిసిన వెంటనే అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టామన్నారు. పోస్టుమార్టం రిపోర్టును బట్టి కేసు విచారణ చేస్తామని వివరించారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. బుర్రా వెంట నాయకులు ముప్పవరపు కిశోర్, గణేశం గంగిరెడ్డి, చీమల వెంకటరాజా, నగ్గల నారయ్య, చనమాల కోటేశ్వరరావు, తలారి ప్రసన్నకుమారి, ఎ.వసంతరావు, కుంభాల క్రాంతికుమార్, షేక్ ఖిభారి, జంగిలి ఇజ్రాయెల్, శ్రీరామ కుమారస్వామి, శివకృష్ణ, ఎనుబోరి బాబు, గోచిపాతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**దర్యాప్తునకు డిమాండ్**

కిశోర్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి, వాస్తవాలను బయటపెట్టాలని కోరుతూ వామపక్ష, దళిత, బహుజన ప్రజా సంఘాల నాయకులు డీఎస్పీ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అతను ఆత్మహత్యకు పాల్పడేంత పిరికివాడు కాదని, నీట మునిగి చనిపోయే దానికి అవకాశం లేదని, అతడికి ఈత కూడా వచ్చని వివరించారు. ఒత్తిళ్లకు తలొగ్గకుండా వాస్తవాలను వెలికి తీయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేయాలని సీఐ నఫీజ్‌బాషాను డీఎస్పీ ఆదేశించారు. వినతిపత్రం అందజేసిన వారిలో వెంకటేశ్వర్లు, పాలేటి కోటేశ్వరరావు, ముప్పవరపు కిశోర్, సురేష్‌బాబు, షేక్ హుస్సేన్, రేణమాల అయ్యన్న, గాండ్ల హరిప్రసాద్, చనమాల కోటేశ్వరరావు, పరిశుద్ధరావు, ఓంకారం ఉన్నారు.

# రమణీయం.. చాముండేశ్వరీదేవి తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



హాజరైన భక్తులు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

**ఇందుకూరుపేట:** మండలంలోని గంగపట్నంలో ఉన్న చాముండేశ్వరీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా చివరిరోజైన సోమవారం రాత్రి తెప్పోత్సవం రమణీయంగా సాగింది. చాముండేశ్వరీదేవి, త్రిశూలేశ్వరస్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వెనుక భాగనున్న కోనేరులో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా నావూరు శ్రీనివాసమూర్తి, హైమావతి దంపతుల కుమారుడు, కోడలు నావూరు మురళీమనోజ్‌కుమార్, అరుణ వ్యవహరించారు. ఆలయ అర్చకులు నూతలపాటి అనిల్‌కుమార్ శర్మ, మాచవోలు రామకృష్ణశర్మ, కిశోర్ స్వామి ఆధ్వర్యంలో తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా పూలంగి సేవ జరిపారు. దీనికి దండిగుంట సోదరులు ఉభయదాతలుగా ఉన్నారు. స్థానికులు, ఆలయ మాజీ చైర్మన్ పెనుబల్లి రామచంద్ర నాయుడు, యామిని కృష్ణ దంపతులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కాగా వేకువజామున భక్తులు ఉపవాస దీక్ష తీసుకుని నిప్పుల గుండాన్ని తొక్కారు. ధ్వజాఅవరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంతానం లేని మహిళలకు కొడిముద్దలు పంచిపెట్టారు. విఘ్నేష్ యూత్ వేలాది మందికి ప్రసాద వితరణలు చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

# వైభవంగా వెంగమాంబ గ్రామోత్సవం



ప్రత్యేకాలంకరణలో వెంగమాంబ - గురవయ్య దంపతులు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**దుత్తలూరు:** నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం వెంగమాంబ – గురవయ్య దంపతులను ప్రత్యేకంగా అలంకరించి సుప్రభాతసేవ, గణపతిపూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. రాత్రి వడ్డిపాలెంలోని వెంగమాంబ పేరంటాలు పుట్టినింటి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ విగ్రహాలను వాహనంపై ఉంచి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, సుగాలీల వీరతాండవం నడుమ ఉత్సవం నర్రవాడ, గుదేవారిపాలెం, ఉలవవారిపాలెంలో సాగింది. తిరిగి దేవస్థానం వద్దకు చేరుకుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. హోమగుండంలో ఎండు కొబ్బరి వేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి కూడా గ్రామోత్సవం జరుగుతుంది.

## కండలేరులో 6.356 టీఎంసీలు

**రాపూరు:** కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.356 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 138 |
| లేయర్ (లైవ్) | : 120 |
| బ్రాయిలర్ చికెన్ | : 246 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 274 |
| లేయర్ చికెన్ | : 204 |

# వివాహిత ఆత్మహత్య

**మనుబోలు:** కుటుంబ కలహాలతో ఓ వివాహిత విష గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గొట్లపాళెం గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గొట్లపాళెం ఎస్టీ కాలనీకి చెందిన మల్లంపల్లి ఏడుకొండలు, రమాదేవి (22) దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. రమాదేవి విష గుళికలు తిని తీవ్ర అనారోగ్యానికి గురైంది. కుటుంబసభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం ఆమెను నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. సమాచారం అందుకున్న మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జాతీయ రహదారిపై ప్రమాదం

**చిల్లకూరు:** జాతీయ రహదారిలోని వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో సోమవారం కారును లారీ ఢీకొంది. స్థానికుల కథనం మేరకు.. నూజివీడుకు చెందిన ఏడకొండలు కర్ణాటకలో ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఆయన సెలవులపై సొంతూరికి వెళ్లేందుకు కుటుంబసభ్యులను తీసుకుని కారులో బయలుదేరాడు. వరగలి క్రాస్ రోడ్డు వద్ద వెనుక వస్తున్న మరో కారు ఎడమ వైపు ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. అదే సమయంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో చుట్టుపక్కల ఉన్న వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పెద్ద ప్రమాదం జరిగిందని భావించిన లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి ఎలాంటి గాయాలు కాలేదు. సమీపంలోని రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐ రమ్యస్వాతి, వీఆర్వోలు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## 15 సవర్ల బంగారు ఆభరణాల చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ గిరిబాబు

**ఉదయగిరి:** పట్టణ సమీపంలోని బీసీ కాలనీలోని ఓ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి 15 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బీసీ కాలనీలో ఖాసింపీర్ నివాసం ఉంటున్నారు. అతని కుమార్తె హఫీజ యూనియన్ రోడ్డులో ఉంటోంది. ఆమె ఆరోగ్యం బాగోలేక ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. దీంతో అతను తన భార్యతో కలిసి ఆదివారం కుమార్తె వద్దకు వెళ్లాడు. భార్యాభర్తలు రాత్రి అక్కడే ఉన్నారు. బీసీ కాలనీలోని ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దుండగులు లోనికి ప్రవేశించి రెండు బెడ్‌రూముల్లో బీరువాలు ధ్వంసం చేసి 15 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వెళ్లి చూసే సరికి తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో ఖాసింపీర్ చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ గిరిబాబు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్‌టీం బృందం వేలిముద్రలు సేకరించింది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.